క్లుప్తంగా

లోక్ అదాలత్‌తో ఇరువర్గాలు విజేతలే


జడ్జి శ్రీనివాస్ నాయక్

శ్రీకాళహస్తి: జాతీయ లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు విజేతలేనని శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశం మేరకు జూలై 5న జాతీయ లోక్ అదాలత్ శ్రీకాళహస్తి న్యాయస్థానం ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో దీర్ఘకాలింగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ తదితర కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. దీనిని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలై 5న ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చారు



ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని జెండామాను సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంగళవారం ట్రాన్స్‌కో ఏఈ చలపతి తన సిబ్బందితో కలసి కనెక్షన్ ఇచ్చారు. దీంతో గ్రామంలో లోవోల్టేజీ సమస్య తీరింది. సోమవారం సాక్షి దినపత్రికలో ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వండి సారూ అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ట్రాన్స్‌కో ఏఈ చలపతి సిబ్బందితో కలసి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇచ్చారు. దీంతో లోవోల్టేజీ సమస్య తీరిందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కొందరికే యూరియా


యూరియా లోడ్ చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొందరు రైతులకే యూరియాను పంపిణీ చేయడంపై మంగళవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చినాయుడుకండ్రిగలోని రైతు సేవా కేంద్రానికి లారీలో 400 బస్తాల యూరియా వచ్చింది. లారీలోని యూరియా లోడ్ నుండి ముగ్గురికి రైతులకు రెండు ట్రాక్టర్లు, ఒక ఆటోలో 120 బస్తాలను లోడ్ చేసి పంపించడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులందరికీ ఇవ్వకుండా ముగ్గురి రైతులకు భారీగా యూరియాను ఎలా పంపుతారని వ్యవసాయాధికారులను నిలదీశారు. యూరియా కోసం పది రోజులుగా ఎదురు చూస్తున్నామని, అందరికీ ఇవ్వకుండా ఇలా చేయడం పద్ధతి కాదని తెలిపారు. విషయం తెలుసుకున్న మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు ఆర్‌ఎస్‌కే వద్దకు వచ్చి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముక్కంటి సేవలో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్


ఆలయం వద్ద నందీశ్వర్‌గౌడ్‌తో కోలా ఆనంద్, బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం తెలంగాణలోని పటాన్‌చెరు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు నందీశ్వర్‌గౌడ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలిమాజీ అధ్యక్షుడు, బీజేపీరాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, పారిశ్రామికవేత్త దామెర హరి, నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, చందు, డిల్లీ, నాని, సిద్ధు, గిరిధర్‌సాయి, రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు దోపిడీ

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం తదితర కనీస వసతులు కల్పించడం లేదు. విద్యార్థుల నుంచి ఫీజులను మాత్రం ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలను తనిఖీలు చేసి, చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ఇదీ సత్యవేడు నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల పరిస్థితి.
– వరదయ్యపాళెం

- ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలు
- ఇష్టారాజ్యంగా ఫీజుల పెంపు
- అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయం
- విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించని వైనం
- విద్యాహక్కు చట్టానికి తూట్లు


వరదయ్యపాళెంలో ప్రైవేటు స్కూల్ తరగతి గదులను పరిశీలిస్తున్న ఎంఈఓ(ఫైల్)

సత్యవేడు నియోజకవర్గంలో మొత్తం 26 ప్రైవేటు పాఠశాలలు, మరో 18 ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వివిధ మండలాల్లో ఉన్న ఈ పాఠశాలలు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఈ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం ఎక్కడా అమలు కావడం లేదు. ఈ చట్టాన్ని అమలు చేయడంలో విద్యాశాఖాధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

కనీస సౌకర్యాలు కరువు

నియోజకవర్గంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధను యాజమాన్యాలు మౌలిక వసతుల కల్పనలో చూపడం లేదు. సగానికిపైగా పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్ల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదు. దుర్గంధంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు.

నాన్ క్వాలిఫైడ్ టీచర్లు

నియోజకవర్గంలోని దాదాపు అన్ని ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు లేరు. పాఠశాలల గుర్తింపు సమయంలో యాజమాన్యాలు బీఈడీ, పండిట్ ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసి గుర్తింపు పొందుతున్నారు. ఆ తర్వాత ట్రైనింగ్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందని ఇంటర్, డిగ్రీ చదివిన వారితో విద్యా బోధన చేయిస్తున్నారు.

ఫైర్‌సేఫ్టీ గాలికి..

పాఠశాలల యాజమాన్యాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను గాలికి వదిలేశాయి. కొన్ని పాఠశాలలు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నా దాదాపు 20కిపైగా పాఠశాలలు, కళాశాలలు పాటించడం లేదు. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగితే విద్యార్థులు బయటకు వెళ్లేందుకు భవనాల్లో రెండు మార్గాలు ఉండాలి. అయితే ఎక్కడా రెండు మార్గాలు కనబడడం లేదు. అగ్ని ప్రమాదాలను నియంత్రించే పరికరాల ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

క్రీడా ప్రాంగణాలు కరువు

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు ఉండడం లేదు. ప్రైవేటు యాజమాన్యాలు పాఠశాలలకు అనుమతి పొందే సమయంలో రెండు, మూడు గదులను ఇండోర్ ఆటస్థలాలుగా చూపిస్తున్నాయి. అలాగే పాఠశాలలకు దూరంగా ఉన్న ఖాళీ స్థలాలను చూపి విద్యాశాఖాధికారులకు తాయిలాలు ఇచ్చి అనుమతి పొందుతున్నాయి. నియోజకవర్గంలో దాదాపు సగానికి పైగా పాఠశాలలకు క్రీడా ప్రాంగణాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.

నియంత్రణ లేని ఫీజులు

ఫీజులకు సంబంధించి పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక ఖాతాలు తెరవాలి. ప్రతి ఏటా ఆడిట్ నిర్వహించాలి. 1994లో వచ్చిన జీఓ ప్రకారం 5 శాతానికి మించి లాభం తీసుకోరాదు. అయితే ప్రస్తుతం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు రూ.25 వేల నుండి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు.

కొరవడిన ఎంఈఓల పర్యవేక్షణ

ప్రైవేటు పాఠశాలలపై ఎంఈఓల పర్యవేక్షణ శూన్యంగా మారింది. ప్రభుత్వ అనుమతికి ప్రాథమిక స్థాయి నుంచి పూర్తిస్థాయిలో పరిశీలన జరిపే అధికారులు వాటిపై దృష్టి సారించడం లేదు. విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు ఫిర్యాదులు చేస్తున్నా తగిన చర్యలు తీసుకోవడం లేదు. ఫిర్యాదులపై ఆయా పాఠశాలల యాజమాన్యాలకు సమాచారం ఇస్తున్నారు. దీనిపై విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారి ప్రైవేటు పాఠశాలలను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విజిలెన్స్ విచారణ జరపాలి


ప్రైవేటు పాఠశాలలపై విజిలెన్స్ విచారణ జరపాలి. పాఠశాలల్లో కనీస వసుతుల కల్పన, ఫీజులు, పుస్తకాల అమ్మకాలు తదితరాలపై తనిఖీలు జరగాలి. నిబంధనలు పాటించని వాటి గుర్తింపును రద్దు చేయాలి.
– తరుణ్, ఏఐఎస్‌ఎఫ్, సత్యవేడు

నిబంధనలు పాటించకుంటే చర్యలు


ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు వివరాలను మాకు పంపాలని సూచించాం. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందే. లేనిపక్షంలో చర్యలు తప్పవు. పాఠశాలలను తనిఖీలు చేస్తున్నాం.
– సరస్వతి, ఎంఈఓ, వరదయ్యపాళెం మండలం

ఎన్ఎంఎంఎస్‌కు ముగ్గురి ఎంపిక


స్కాలర్‌షిప్‌కు ఎంపికైన పల్లం విద్యార్థులు

ఏర్పేడు: మండలంలోని పల్లం హైస్కూల్‌లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైనట్లు హైస్కూల్ హెచ్ఎం తీగల ఆనంద్ తెలిపారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు శిరీష, లాస్య, మోక్షిత్ కృష్ణ 2024- 25 విద్యా సంవత్సరానికి ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాలలోని విద్యార్థులకు ఉపాధ్యాయులచే పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నందున ప్రతి సంవత్సరం పోటీ పరీక్షల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఎంపికవుతున్నారని తెలియజేశారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఐదేళ్లపాటు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు.

ఘనంగా గంగ జాతర


మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

రేణిగుంట: మండలంలోని ఎల్లమండ్యం పంచాయతీ బాలాజీ నగర్‌లో కొలువైన నడివీధి గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాలకు గ్రామాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవారం ఉదయం మహిళలు అమ్మవారికి అంబలి సమర్పించారు. సాయంత్రం పలక దరువులు, పంబజోడుల వాయిద్యాల మధ్య గ్రామంలోని మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. బుధవారం అమ్మవారికి కుంభం, గ్రామోత్సవం నిర్వహించడంతో జాతర మహోత్సవాలు ముగిస్తాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గుణశేఖర్ రెడ్డి, కోటేశ్వరరావు, గోపాల్, యుగంధర్ రెడ్డి, బాలాజీ నగర్ యూత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల రద్దుపై ఆందోళన


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు పార్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను రద్దు చేయడంపై మంగళవారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల రద్దు చేసి, పీవీకండ్రిగ గ్రామంలోని పాఠశాలలో విలీనం చేశారని తెలిపారు. 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పీవీకండ్రిగ పాఠశాలకు చెరువు గట్టు, చెరువు కలుజు, పంట కాలువ, శ్మశానాలను దాటుకుని వెళ్లాలన్నారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాఠశాలను రద్దు చేయకూడదని తీర్మానం ఇచ్చినా రద్దు చేయడం దారుణమని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాల రద్దును ఆపేసి, పాఠశాలను పునః ప్రారంభించాలని కోరారు.

మా పిల్లల చదువుతో ఆటలొద్దు


ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

ఏర్పేడు: పాఠశాలల విలీనం పేరుతో మా పిల్లల చదువుతో పాలకులు ఆటలాడుకుంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని మేర్లపాక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పిల్లల్లో 3, 4, 5 తరగతి విద్యార్థులను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్నసముద్రం పాఠశాలలో విలీనం చేసి అక్కడకు వెళ్లి చదువుకోవాలని చెప్పడంతో పిల్లల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామం పక్కనే ఆరులేన్ల జాతీయ రహదారి ఉందని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికితోడు మన్నసముద్రానికి వెళ్లే మార్గంలో చెరువు, బావులు దాటుకుని చిన్న పిల్లలు ఎలా వెళతారని వారు ప్రశ్నించారు. అధికారులు స్పందించకుంటే తమ పిల్లల చదువులు మాన్పించాల్సిన పరిస్థితి ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మా స్కూలు మాకు కావాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

తొట్టంబేడు: మండలంలోని శివనాథపురంలో ప్రాథమిక పాఠశాలను రామచంద్రపురానికి మారుస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై పిల్లలు వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. శివనాథపురం నుంచి రామచంద్రపురం సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం ఉందని పిల్లలు వచ్చి వెళ్లడానికి కష్టతరమవుతుందని తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మసిస్ట్‌కు సత్కారం

శ్రీకాళహస్తి: స్థానిక హోమియో ఆస్పత్రిలో ఏడేళ్ల సుదీర్ఘ సేవలు అందించిన ఫార్మసిస్ట్ టి.తారక్‌నాథ్‌ను ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ప్రస్తుతం ఆయన పుత్తూరులో పని చేస్తున్నా పట్టణ ప్రజలకు అందించిన సేవలకు గుర్తుగా ఆయన్ను ఏరియా ఆస్పత్రి సిబ్బంది మంగళవారం సత్కరించారు. తారక్ నాథ్ మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో పనిచేసిన రోజులు జీవితంలో గుర్తుండి పోతాయన్నారు.

ఆస్పత్రిలో విద్యార్థులకు పరామర్శ


విద్యార్థులను పరామర్శిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన బీసీ వసతి గృహం విద్యార్థులను శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరామర్శించారు. వసతి గృహంలో మంగళవారం టిఫిన్ చేసిన విద్యార్థులకు పాఠశాలకు వెళ్లి, అక్కడ వాంతులు చేసుకున్నారు. గమనించిన ఉపాధ్యాయులు 16 మంది విద్యార్థులను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిని అంజూరు పరామర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బీసీ హాస్టల్ పిల్లలకు ఫుడ్ పాయిజన్ కావడంతో 16 మందిని ఆస్పత్రిలో చేర్చారని, అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదన్నారు. మెరుగైన సేవలందించిన వైద్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పిల్లలు అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. ఉదయం అల్పాహారం అందించే ఇడ్లీ పిండిని పరిశీలించకుండా చిన్నారులకు అందజేశారని పేర్కొన్నారు. వార్డెన్‌పై వెంటనే శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్లతాంగల్ బాలాజీ ప్రసాద్‌రెడ్డి, శ్రీవారి సురేష్, బాలిశెట్టి విజయ్ శేఖర్, పెరుమాళ్ చౌదరి మరియు విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పరాశరేశ్వర బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం: టీటీడీ అనుబంధ శ్రీచంపకవల్లి సమేత పరాశరేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. బుధవారం నుంచి జూలై 4న శుక్రవారం వరకు 9 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం 6.30 గంటలకు మిథున లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఉత్సవాలలో ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం వాహన సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ నిర్వహించనున్నారు.

దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్‌గా క్రిస్టల్‌దాస్

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ క్రిస్టల్‌దాస్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లా కురబలకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి దాసుకుప్పం పీహెచ్‌సీకి వచ్చారు. విజయపురం పీహెచ్‌సీ నుంచి డాక్టర్ మురళి వచ్చారు. ఇద్దరూ బాధ్యతలు స్వీకరించారు.

ఆర్థిక సాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి కరుణీక సంఘం ఆధ్వర్యంలో విలేకరి కుటుంబానికి మంగళవారం ఆర్థిక సాయం చేశారు. పత్రిక విలేకరి మెహర్‌కుమార్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అతని తల్లికి వారు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండురంగం, ఉమాశంకర్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని దామానెల్లూరు ఆర్చి రోడ్డు వద్ద మంగళవారం కారు అదుపు తప్పి బోల్తా పడింది. సూళ్లూరుపేట నుంచి శ్రీకాళహస్తికి వెళ్తుండగా కారు దామానెల్లూరు ఆర్చి రోడ్డు వద్ద అదుపు తప్పి కాలువలో బోల్తా పడడంతో . కారులోని వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు.

విద్యా సామగ్రి పంపిణీ



వరదయ్యపాళెం: మండలంలోని కాంబాకం గిరిజనకాలనీ, రామిరెడ్డిపాళెం, కాంబాకం దళితవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 80 మందికి విద్యా సామగ్రిని స్థానిక బీజేపీ నాయకుడు మురళీ ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పురుషోత్తం, ఏసు తదితరులు ఉన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం అమావాస్య ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాళహస్తి - సత్యవేడు :
90100 03139

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షునికి సన్మానం


కూనాటి రమణయ్యయాదవ్‌ను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

ఏర్పేడు: మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కూనాటి రమణయ్య యాదవ్‌ను మంగళవారం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఏర్పేడులో ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయన్ను కలసి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిరత్నంరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీ శ్రీమంతుల రామయ్యచ్చారి, ఐతేపల్లి గురునాథం, దామోదర్‌రెడ్డి, కేశవులు, సాయి యాదవ్ పాల్గొన్నారు.

పొగాకుతో క్యాన్సర్ ముప్పు


క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వరదయ్యపాళెం: పొగాకు ఉత్పత్తుల వినియోగంతో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ద్వైత తెలిపారు. మంగళవారం టీటీడీ స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వరదయ్యపాళెం-2, మరదవాడ సచివాలయాల పరిధిలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ సహకారంతో జిల్లా వ్యాప్తంగా రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాలు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపింది. బీపీ, షుగర్ పరీక్షలతోపాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్, పురుషులకు నోటి క్యాన్సర్ వంటి పరీక్షలతోపాటు మమోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్‌స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ చైతన్యభాను, డాక్టర్ పద్మావతి, స్థానిక సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి బసిరెడ్డి పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మదనపల్లి బ్రాంచ్ - 0868, సి.టి.యం.రోడ్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా
ముందస్తు అమ్మకం ప్రకటన
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క రూల్స్ 8(5) & 8(6) నిబంధనల ప్రకారము జారీచేయబడినది)
[illegible]
... తేది.04.02.2025 ... తేది.04-02-2025 నాటికి రూ.13,80,651/- + ... తేది.05-02-2025 ... [illegible]
... 13(4) ... తేది.16.04.2025 న స్వాధీనం ... [illegible]
... తేది.20.04.2025 న వార్తా పత్రికలైన సాక్షి ... [illegible]
... తేది.04.02.2025 ... 30 రోజులలోగా ... [illegible]
స్థిరాస్తి వివరములు
[illegible] ... సర్వే నెం.167 మరియు 168 ... డోర్ నెం.2-357-ఎ-1 లో "శ్రీ సాయి అపార్ట్‌మెంట్" గల బిల్డింగ్. ... 50 అడుగుల వెడల్పు రోడ్డు ... ప్లాట్ నెం.ఏ-41 ... 40 అడుగుల వెడల్పు రోడ్డు.
... 16.76 మీటర్లు ... 15.32 మీటర్లు ... 18.29 మీటర్లు ... 18.29 మీటర్లు ... [illegible]
... 14.32 మీటర్లు ... 14.32 మీటర్లు ... 22 ½ ... 6.93 మీటర్లు ... 22 ½ ... 6.93 మీటర్లు.
... 118.80 ... "శ్రీ సాయి అపార్ట్‌మెంట్" బిల్డింగ్ 469.63 ... [illegible]
... సర్వే నెం.167 మరియు 168 ... డోర్ నెం.2-357-ఎ-1 ... 469.63 ... 54.916 ... ఫ్లాట్ నెం.101 ...
... సర్వే నెం.167 మరియు 168 ... 469.63 ... 54.916 ... 1450 ... ఫ్లాట్ నెం.101 ...
డాక్యుమెంట్ నెం.808/2016, తేది.10-02-2016 ప్రకారం ... [illegible]
తేది : 05.06.2025, ప్రదేశం : మదనపల్లి సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా